క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఇద్దరు విద్యార్థులు


దుర్గావేణి


ఎ.అశోక్

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నైని గీతా దుర్గావేణి, లాగరాయి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఎ.అశోక్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్పులకు (ఎన్‌ఎంఎంఎస్) ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ. 12,000 చొప్పున ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందని ఎంఈఓ సూరయ్యారెడ్డి తెలిపారు. కాగా జిల్లాలో ఎన్‌ఎంఎం స్కాలర్‌షిప్పులకు 44 మంది అర్హత సాధించినట్టు డీఈఓ బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌ల అర్హత కోసం గత ఏడాది డిసెంబర్ 3వ తేదీన రంపచోడవరంలో 8వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే.

65 మందికి వైద్య సేవలు


వయ్యేడులోని వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సుష్మ

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు గ్రామాలైన వయ్యేడు, బూరుగపల్లిలలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుష్మ సుమారు 65 మందికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీపీ, సుగర్ సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేశారు. 50 మందికి బీసీజీ టీకాలు వేసినట్టు డాక్టర్ సుష్మ తెలిపారు. ఏఎన్‌ఎం భవానీ, హెచ్‌వీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ రామారావు, 104 డీఈఓ శ్రీనివాస్, ఆశ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


దోమల నివారణపై జాగ్రత్తలు సూచిస్తున్న అధికారులు

గంగవరం: దోమల నివారణతో వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా మలేరియా కార్యాలయ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసరాజు అన్నారు.గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయితీరాజ్, ఆరోగ్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్, క్లోరినేషన్ తదితర విధానాల నిర్వహణను తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


బస్ ఢీ కొట్టడంతో గాయాలైన వ్యక్తిని 108లో జడ్డంగి పీహెచ్‌సీకు తరలిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పెద్దాపురం అనే కూలీ తీవ్రగాయాల పాలయ్యాడు. పెద్దాపురం ఇంటి నుంచి సైకిల్‌పై పొలానికి వెళ్తుండగా అతనిని ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టినట్టు స్థానికులు తెలిపారు. రోడ్డుపై పడిపోయిన అతనిని బస్సు డ్రైవర్ పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయారు. తల ఇతర భాగాల్లో గాయాలైన పెద్దాపురంను 108 సహాయంతో జడ్డంగి పీహెచ్‌సీకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్‌ఐ రఘునాథరావు మాట్లాడుతూ ఈ సంఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని, బస్సును సంఘటన స్థలంలో ఉంచినట్టు చెప్పారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- జోరందుకున్న దుక్కులు
- వాణిజ్య పంటల సాగుపై ఆసక్తి
- వేసవి పంటగా వేరుశనగ
- ఆశాజనకంగా మార్కెట్
- గిట్టుబాటు ధరలు
- ఆనందంలో గిరిజన రైతులు


వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతులు(ఫైల్)


మార్కెట్‌లో విక్రయానికి తీసుకొచ్చిన వేరుశనగ


పెదబయలులోని మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో కూరగాయలు, వేరుశనగ పంటలు

పెదబయలు: గిరిజన ప్రాంత రైతులు సంప్రదాయ పంటలు పసుపు, పిప్పళ్ల పంటలు సాగు చేస్తూనే ఖరీఫ్ వరి, వాణిజ్య పంటలపై దృష్టి పెడుతున్నారు. మండలంలోని సీతగుంట, అరడకోట, అడుగులుపుట్టు, గలగండ, గంపరాయి, పెదకోడాపల్లి, అరడకోట, ముంచంగిపుట్టు మండలం దారెల, పెదగుడ, ఏనుగురాయి, మాకవరం,దోడిపుట్టు పంచాయతీల్లో ఎక్కువగా వేరుశనగలు సాగుచేస్తున్నారు. మన్యంలో పండించే వేరుశనగలకు మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో రైతులు గత ఐదేళ్ల నుంచి ఎక్కువగా పండిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న వేరుశగనకు మైదాన ప్రాంతంలో మంచి ధరలు వస్తున్నాయి. దీంతో మండలంలోని సీతగుంట, అడుగులపుట్టు పంచాయతీల్లో వందల ఎకరాల్లో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ ఏడాది మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో మన్యం రాగులకు డిమాండ్ ఉండంతో మండలంలోని పలు ప్రాంతాల్లో రాగుల పంటను కూడా ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ సాగు

మండలంలోని ఖరీఫ్ వరి, సామలు, రాగుల పంటలకు సంబంధించి రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. మెట్ట పంటలు సామలు, రాగులు, కొర్రలు, ఇతర పంటలకు సంబంధించి పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వరి కోసం దుక్కులు దున్నుతున్నారు. వేసవి దుక్కుల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని రైతులు చెబుతున్నారు. పంటల కలుపు నివారణలో వర్షం పడితే నీటిని ఎక్కువ పీల్చుకుంటుందంటున్నారు. పంటకు వేసిన సేంద్రియ ఎరువులు భూమిలో త్వరగా కలుస్తుందని పంట బాగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

వాతావరణం అనుకూలం



వేరుశెనగల పంట దిగుబడి బాగుంది. ఈ ఏడాది మొక్క ఏపుగా పెరుగుతోంది. గత ఏడాది కంటే దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మరో రెండు నెలల్లో పంట చేతికి అందే అవకాశం ఉంది. గత ఏడాది ధర బాగానే ఉంది. ఈ ఏడాది ఇంకా పెరిగే అశకాశం ఉందని ఆశగా ఉంది. ఈ ఏడాది మే నెల నుంచే వర్షాలు పడుతుండడంతో సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో సేంద్రియ పద్ధతిలో పండించే వేరుశనగకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– గంగాధర్, రైతు, క్లాగువలస, పెదబయలు మండలం

విత్తనాల పంపిణీ



వేరుశెనగ రైతులకు కదిరి లేపాక్షి రకం వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశాం. మండలంలో ముందుగా ఎంపిక చేసిన గంపరాయి గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులకు 300 కిలోల కదిరి లేపాక్షి రకం విత్తనాలు అందజేశాం. ఈ రకం విత్తనాల వినియోగంతో దిగుబడి బాగున్నట్టు రైతులు కోరడంతో వాటిని రైతులకు పంపిణీ చేశాం. గలగండ పంచాయతీ సిరశపల్లి, అడుగులపుట్టు గ్రామాల్లో రాగుల పంటల సాగు ఎక్కువగా ఉంది.

– ఎ.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి, పెదబయలు మండలం

ప్రజా సమస్యలపై పోరాటానికి సన్నద్ధం


ఎస్.కొత్తూరు గ్రామంలో జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: ఎన్నికల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణ విషయమని అన్ని వేళల్లో నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు తెలిపారు. మండలంలో సొలభం పంచాయతీ ఎస్.కొత్తూరు గ్రామంలో ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వివిధ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజల ఆర్థిక స్థితిగతులు మారాయన్నారు. రాష్ట్ర ప్రజలంతా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారని, అయితే ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయన్నారు. జగనన్న రాష్ట్రానికి చేసి అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు ప్రజల్లో సజీవంగా ఉంటాయన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు, అరకు అసెంబ్లీ అభ్యర్థులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగంలను గెలిపించి జగనన్న వెంటే గిరిజనులంతా ఉన్నారని మరోసారి రుజువు చేశారన్నారు. ప్రజా సమస్యలు, ఇబ్బందులపై పోరాటాలు చేయటానికి గిరిజనులందరు సన్నద్ధంగా ఉండాలని ఆయన కోరారు.

పారదర్శకంగా డ్వాక్రా సంఘాల నిర్వహణ


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ఆదినారాయణ

రాజవొమ్మంగి: డ్వాక్రా సంఘల నిర్వహణ పూర్తి పారదర్శంగా ఉండేలా చర్యలు తీసుకొంటున్నట్టు రాజవొమ్మంగి ఏపీఎం ఆదినారాయణ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో వెలుగు సీసీలు, వీఓఏలతో సమావేశం అయ్యారు. పలు అంశాలను తెలియజేసారు. ఆయన మాట్లాడుతు అవకతవకలకు వీలు లేకుండా ఇకపై రుణాలన్నీ నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్‌లోనే చేయాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. లోకోస్ యాప్ ఉపయోగించి రుణాలు వసూళ్లు, చెల్లింపులు జరగాలన్నారు. చిన్న సంఘలు అప్పులు చెల్లిస్తున్నప్పుడు చెక్‌ల ద్వారానే తీసుకోవాలని వీఓఏలకు ఏపీఎం సూచించారు.

లేదా ఆ సొమ్మును వీఓ ఖాతాకు జమ చేసి తరువాత రుణఖాతాలకు జమ చేయాలని, ఎట్టి పరిస్థితులలోనూ సభ్యుల నుంచి నగదు వసూలు చేయవద్దని ఆదేశించారు. రుణాలు తీసుకొనే డ్వాక్రా మహిళల కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, వారి పిల్లల విద్యావ్యవహారాల వంటి సమాచారం అంతా యాప్ ద్వారా తెలుసుకొనే అవకాశం ఉందని వివరించారు. స్వయం సహాయ సంఘాల ఆధార్, వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, వారి జీవనోపాధి వివరాలు, కుటుంబసభ్యుల వివరాలు లోకోస్ యాప్‌లో నమోదై ఉన్నట్టు ఆదినారాయణ చెప్పారు. ఈ యాప్ ద్వారానే చెల్లింపులు వసూళ్ల జరపాలని సూచించారు.

అందుబాటులో విత్తనాలు


రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రంలో విత్తన నిల్వలు


మారేడుమిల్లిలోని ఆర్‌బీకేలో విత్తనాలు పరిశీలిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

రాజవొమ్మంగి: మండలానికి మలివిడతగా శుక్రవారం ఎంటీయూ 1061 (ఇందిరా) అనే 345.9 క్వింటాళ్ల వరి వంగడాలు ఏపీ సీడ్స్ విజయవాడ నుంచి వచ్చినట్టు స్థానిక వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. వీటిని సబ్సిడీపై త్వరలోనే పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రంలో 205.80 క్వింటాళ్లు, జడ్డంగి రైతు భరోసా కేంద్రంలో 140.10 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. అదే విధంగా విశాఖపట్నం ఏపీ సీడ్స్ నుంచి 60 క్వింటాళ్ల పచ్చిరొట్ట (పచ్చిరొట్ట ఎరువు) విత్తనాలు వచ్చాయన్నారు. వీటిలో రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రంలో 20 క్వింటాళ్లు, వాతంగి ఆర్‌బీకేలో- 10 క్వింటాళ్లు, జడ్డంగి ఆర్‌బీకేలో 20 టన్నుల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని సోమవారం నుంచి రైతులకు అందజేయనున్నట్టు తెలిపారు. 10 క్వింటాళ్ళ జనుము విత్తనాలు కూడా అందుబాటులో వున్నాయన్నారు. ఇప్పటి వరకు 841.5 క్వింటాళ్ళ వరి విత్తనాలు అందజేశామన్నారు. మండలానికి మొత్తం 1360 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమున్నట్టు నివేదిక ఇవ్వగా, ప్రభుత్వం ఇప్పటి వరకు 841.5 క్వింటాళ్ల ఖరీఫ్ వరి విత్తనాలు సరఫరా అయినట్టు ఏఓ రమేష్‌నాయుడు తెలిపారు.

మారేడుమిల్లి: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు ఏఓ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్టు చెప్పారు. ఎంటీయూ –1065, జీజీఎల్, ఆర్‌ఎన్‌ఆర్ రకాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో వచ్చిన వరి విత్తనాలు మొలక శాతం నిర్ధారించి మూడు రోజులు తరవాతు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. రైతులు ఆర్‌బీకేలో వరి విత్తనాలు పొందేందుకు రైతులు తమ పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జెరాక్స్ కాపీ అందజేయాలన్నారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం


వాసవీ కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న భక్తులు


ఆలయానికి వంటపాత్రలు, గ్యాస్ స్టౌ అందజేస్తున్న వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ నరసింహారావు

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. కింతలి–గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది గ్రామాలకు చెందిన వాసవీ క్లబ్ మహిళలు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చిన్నారులకు, మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాసవీ జిల్లా గవర్నర్ వై. నరసింహారావు, ఉప గవర్నర్ మధు, వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. క్లబ్‌కు వంటపాత్రలు, గ్యాస్ స్టౌను గవర్నర్ నరసింహరావు అందజేశారు. స్థానికులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు. కింతలి–గాదిరాయి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, కోశాధికారి పుట్టా కొండలరావు, వైస్ ప్రెసిడెంట్ కొట్యాడ గున్నయ్యశెట్టి, జిల్లా కోశాధికారి అనపగడ్డ హరిబాబు, రావాల సతీష్, పుట్టా మురళీకృష్ణ, తవ్వా సన్యాసిశెట్టి, వాసవీ క్లబ్ సభ్యులు, వాసవీ వనిత సభ్యులు పాల్గొన్నారు.

10 నుంచి ఇంటింటికీ ధర్మ ప్రచారం


సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుల సమావేశం


కొండకర్ల రామాలయంలో సమావేశమైన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

పాయకరావుపేట: ఈ నెల 10 నుంచి 25 వ తేదీ వరకు ఇంటింటికీ ధర్మప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ ఖండ సంయోజకులు నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. ఎస్.నర్సాపురంలోని కృష్ణ మందిరంలో శుక్రవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ తాడి సూరిమూర్తి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత న్నారు. గ్రామంలో ఉన్న ఆలయాల్లో ప్రతి వారం భజన, హారతి కార్యక్రమాలు జరిపించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల ఉప కన్వీనర్లు పల్లేల జోగారావు, మేడిశెట్టి దివాణం, కట్టా వీరబాబు, నడిగట్ల శ్రీనివాసరావు, మంచాల రవి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఈ నెల 11 నుంచి 15 వరకూ ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి. రమణ తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శాఖా గ్రంథాలయాధికారి మహేశ్వరరావు


విజేతలతో లైబ్రేరియన్ జర్త సత్యవతి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో పనసల ప్రసాద్


కూనవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ సైదాబ్

జి.మాడుగుల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్‌తో పాటు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలకు శాఖా గ్రంథాలయాధికారి వంపూరి మహేశ్వరరావు బహుమతులను అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది బాలసుబ్రహ్మణ్యం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గతనెల 15వ తేదీ నుంచి గ్రంథాలయ కర్త జర్త సత్యవతి ఆధ్వర్యంలో ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సత్యవతి మాట్లాడుతు గ్రంథాలయంలో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో ప్రతీ రోజు విద్యార్థులకు కథలు చెప్పడం, చదివించడం, రాయించడం, ఆటలు, పాటలు, వ్యాయామం, యోగ, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు.విద్యార్థులు విజ్ఞాన సముపార్జనకు పెంపొందించే అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసినట్టు చెప్పారు. విజేతలతో పాటు శిక్షణ పొందిన విద్యార్థులందరికీ ప్రశంస పత్రాలను లైబ్రేరియన్ సత్యవతి అందజేశారు.

కూనవరం: వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో దోహదపడ్డాయని డాక్టర్ దుద్దుకూరి వెంకయ్య అన్నారు. శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో గత నెల 15 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పఠనాశక్తిని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వేసవి శిబిరాలు చక్కని వేదికైనట్టు కొనియాడారు. అనంతరం లైబ్రేరియన్ మాదేటి గోవిందరాజులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిబిరాలను 23 రోజులపాటు సద్వినియోగం చేసుకున్నట్టు చెప్పారు. గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ఆటల, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశా మన్నారు. అనంతరం అందరికీ స్వీట్స్, బిస్కెట్స్, చాక్‌లైట్స్ పంపిణి చేశారు. విఆర్ పురం శాగ్రంథాలయం సహాయకులు తత్యారపు నాగరాజు, కాచవరం బీడీసీ సూధిపాక శ్రీనివాసరావు, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చింతపల్లిరూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని ఎంఈవో పనసల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత నెల 17వ తేదీ నుంచి ఈనెల 7వ తేదీ వరకు స్థానిక శాఖా గ్రంథాలయంలోని జరిగిన వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వం పోటీలతో పాటు వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను ఆయన అందజేశారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా కరాటే, యోగాల్లో శిక్షణ ఇచ్చిన కరాటే అసోసియేషన్ స్టూడెంట్స్ కోఫుకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ బాకూరు పాండురాజుని అభినందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపీనాథ్, గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మారేడుమిల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేసవి శిబిరంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

హుకుంపేట: బాల్యం నుంచి విద్య అందిస్తేనే చిన్నారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని పాడేరు ఎక్సైజ్ ఎసై కే.సైదాబ్ అన్నారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయ అధికారి సత్యవతి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎక్సైజ్ ఎస్ఐ సైదాబ్ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు గొంతువ్యాపు వ్యాధి నివారణకు టీకాలు


పశువులకు టీకాలను వేస్తున్న సాయికుమార్

కె.కోటపాడు: ఆర్నెల్లు పైబడిన ఆవులు, గేదెల్లో గొంతువాపు వ్యాధి రాకుండా ఉండేందుకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ పశుసంవర్ధకశాఖ ద్వారా ఉచితంగా వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. శుక్రవారం ఎ.కోడూరులో 120 ఆవులకు, గేదెలకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ వేశారు. వర్షాకాలంలో ఆరుబయట లేత పచ్చగడ్డిని పశువులు మేతగా తీసుకోవడం వల్ల బ్యాక్టీరియా సంక్రమించి గొంతు కింద వాపు వస్తుందన్నారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం, నోటంట నురుగ రావడం, మేత తక్కువగా తినడం, వంటి లక్షణాలు వస్తాయన్నారు. ఈ కారణాలతో పశువుల నుంచి పాల దిగుబడి తగ్గే అవకాశాలున్నట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా పశువులకు హెచ్‌ఎస్ టీకాలను ముందస్తుగా వేయించి వ్యాధి బారిన పడకుండా చర్యలను తీసుకోవాలని సూచించారు.

వ్యవసాయ పనుల్లో రైతుల నిమగ్నం

రోలుగుంట: వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. రెండు వారాలుగా అడపా దడపా వర్షాలు పడుతున్నాయి. దీంతో భూముల్లో పదును ఉండడంతో జె.పి.అగ్రహారం, అడ్డసరం, వడ్డిప తదితర గ్రామాల్లోని మెట్ట భూముల్లో దుక్కులు చేసి సరుగుడు మొక్కలు నాటారు. రోలుగుంట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, కొండపాలెం తదితర గ్రామాల్లో చెరకు నాట్లు వేసుకున్నారు. భోగాపురం, కంచుగుమల, కొవ్వూరు. కె.నాయుడుపాలెం తదితర గ్రామల్లో పెసలు, బొబ్బర్లు, మినప తదితర అపరాల సాగు విస్తారంగా చేపట్టారు. ఆయా పంటల్లో వర్షాలకు కలుపు మొక్కలు అధికంగా నాటడంతో గొప్పులు తవ్విస్తున్నారు. ఈ పనుల వల్ల భూములు గుల్లబారి మొక్కలకు సమృద్ధిగా గాలి తగులుతుంది. మొక్కలు ఏపుగా ఎదిగి త్వరితగతిన పంట చేతికి వస్తుందని చెబుతున్నారు.

కళాశాలలో కొత్త కోర్సులు

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్టు ప్రిన్సిపాల్ ప్రేమ చంద్ర శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.బీఏ హిస్టరీ,బీఎస్సీ జువాలజీ కోర్సులకు కళాశాల విద్య కమిషనర్ నుంచి అనుమతి వచ్చిందన్నారు.